కథా నిలయం
3548
శ్రీకాకుళం

# శిల్పి

రత్నాపురం ప్రభువు వెంకటాద్రివారికి ఆయేడు క్రొత్త కోరిక ఒకటి కలిగింది. ఏటా రత్నాపురంలో జరుగుతూ వస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలను ఈసారి తమ ఆధ్వర్యం క్రిందనే జరిపించాలనుకున్నారు.

ధనికులకు ఆటపట్టు రత్నాపురం. కోటీశ్వరులను లెక్క పెట్టవలసి వస్తే రెండు చేతుల వ్రేళ్ళూ ముడత బడతాయి. పురజనులే బ్రహ్మాండంగా ఆ ఉత్సవాలను జరుపుకుంటారు. రాజావారు వీలున్నప్పుడు రాణీసమేతంగా వచ్చి దేవీ దర్శనం చేసి, ఉత్సవాలు తిలకిస్తూంటారు.

ప్రభువులవారు విలాస మందిరంలో ఉండగా వారికి ఉద్దేశ్యం కలిగింది. చెంతనున్న రాణీ వారితో ఈ మాట ముచ్చటించారు. రాణీ సుభద్రదేవి వారు సంతోషంతో తల ఊపారు. ప్రభువుల ఆలోచనకు వారిని అభినందించారు.

వెంకటాద్రి ప్రభువు రసహృదయులు, కళాభిమాని, సంగీత సారస్వత ప్రియులు, కవిగా పేరొందినవారందరూ ప్రభువుల మన్ననలు పొంది, పారితోషికాలు అందుకుంటున్నారు. ఇక సంగీత విద్వాంసుల సంగతి చెప్పనక్కరలేదు. ప్రభువులవారే చక్కగా పాడగలరు. సుభద్రాదేవి వారు పంచమ స్వరంతో పాడుతుంటే ప్రభువులు మంత్రముగ్ధులై పరవశం చెందుతారు. ఈ కళలన్నీ ఒక ఎత్తు; శిల్పకళ

మరొక ఎత్తు ప్రభువు వారికి. సుందరమైన శిల్పం వారికంటికి కను పిస్తే, వారు ఎంత అవసర కార్యంపై పోతున్నా, ఆగి రసాస్వాదనం చేసి గాని మరీ కదలరు.

మర్నాడు ఉదయమే దివాన్జీ రంగప్పను పిలిపించి తమ కోరికను ఆయనకు వినిపించారు 'అద్భుతంగా ఉంది ప్రభువుల ఆలోచన' అన్నారు దివాన్జి.

'వెంటనే పురప్రముఖు లందరకూ ఈ సంగతి తెలియజేయండి. యావన్మందీ సహకరించాలని నచ్చచెప్పండి. మరొక సంగతి దివాన్జీ ఈ ఏడు మేమే ఈ ఉత్సవాలు తలపెట్టడం కేవలం యాదృచ్ఛికంగా జరిగింది. అన్యథా ఎంచ వద్దని పురజనులకు చెప్పడం మరువకండి' అన్నారు ప్రభువు.

మళ్ళా వెంటనే అందుకుని 'కావలసిన ఏర్పాట్లన్నీ వెంటనే జరి పించండి. ఏ లోటూ రాకూడదు. ఉత్సవాలు మహా వైభవంగా జర గాలని రాణీవారు కోరుతున్నారు' అని చెప్పారు.

ఈ వార్త విన్న పురప్రజల ఆనందానికి మేరలేదు. దివ్య వైభవం చూడబోతున్నట్లు భావించి ఎదురుచూస్తున్నారు ఉత్సవాలకోసం.

సన్నాహాలు త్వరత్వరగా జరుగుతున్నాయి. ఏ లోపం రాకుండా చేయాలని దివాన్జీ సర్వ విధాలా కృషి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రభువులతో సంప్రదించి, వారి ఆదేశాలు తీసుకుంటున్నారు.

ఇక దేవీ విగ్రహం చేయించటం ఒకటి ముఖ్యమైన పని. చాలా మంది కళాకారులను సంప్రదించగా అందరూ ఇందుకు తగినవాడు సూర్యవర్మేనని చెప్పారు.

వెంకటాద్రి ప్రభువుతో ఈ సంగతి మనవి చేశారు దివాన్జీ. 'చాల చక్కటి శిల్పిని ఎంచారు మీరు. ఇటీవల మనం సేకరించిన

నృత్య విన్యాస శిల్పం చెక్కింది ఈయనే. అతని శిల్పకళా కౌశల్యానికి మేము ఆశ్చర్యచకితులమయ్యాం. రాణీవారు కూడ ఆ శిల్పాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. మన ప్రసాదంలో ఆ శిల్పి అమూల్యాలంకరుణ అది చూచినప్పటి నుంచీ ఆ శిల్పిని కలుసుకోవాలని అనుకుంటున్నాం. ఇది మంచి అవకాశం. ఏమంటారు దివాన్జీ.

'చాలా ఉత్తమంగా ఉంది ప్రభువువారి యోచన. మన ఉత్సవాలకు కావలసిన దేవీ విగ్రహాన్ని ఏ విధంగా గందరించాలో ప్రభువులే స్వయంగా శిల్పికి వివరించవచ్చు'–వినయంగా మనవి చేశారు దివాన్జీ.

'శిల్పి అంటే ఏమని మీ ఉద్దేశ్యం దివాన్జీ! అపర బ్రహ్మ. ప్రాణ ప్రతిష్ట తప్ప తక్కినవన్నీ బ్రహ్మకన్న మిన్నగా కూర్చగల ప్రతిభాశాలి శిల్పి. అందులో సూర్యవర్మవంటి అపూర్వ శిల్పికి మనం చెప్పడమా!'

ప్రభువు మనస్సు గ్రహించారు దివాన్జీ.

'అయితే రేపు ఉదయం ప్రభువుల దర్శనం చేసుకునేటట్టు ఏర్పాటు చేస్తాను'.

'మంచిది' అన్నారు ప్రభువు.

దివాన్జీ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

మర్నాడు రాజావారు శారదా మందిరంలో సుభద్రాదేవి వారి గాన మాధుర్యాన్ని గ్రోలుతున్నారు. రాణి వీణ వాయిస్తూ, పాట పాడుతున్నారు. అది గంధర్వ గానం. గాన నిర్వృతిలో తల మునకలై ఉన్న ప్రభువు పరిచారిక రావడం గమనించలేదు. రసానందంలో రాణీ వారికి కూడా పరిచారిక కనుపించలేదు.

కొంత తడవుకు ప్రభువు ఆమెను చూశారు.

ప్రభువువారి ఏకాగ్రతను, గానామృత పానాన్ని భంగపరచి నందుకు భయపడి పరిచారిక, 'ప్రభూ! దివాన్జీ పనుపుపై సూర్యవర్మ అనే శిల్పి ప్రభువుల దర్శనార్థం వచ్చారు' అని విన్నవించింది.

రాణీవారిని ఉద్దేశించి, 'దేవీ! ఈ శిల్పి ఎవరో కాదు. మన ప్రాసాదంలో క్రొత్తగా అలంకరించిన శిల్పం మలచిన మహా శిల్పే. దేవి కూడ చూడ సమ్మతిస్తే శిల్పిని ఇక్కడకే రప్పిద్దాం' అన్నారు.

'అలవాటు లేని సాహసానికి సిద్ధపడమంటున్నారు ప్రభువులు. ఆ అపరబ్రహ్మను చూడటం అదృష్టంగా భావిస్తున్నాం' అని సమ్మతి తెల్పారు సుభద్రాదేవివారు.

'శిల్పిని లోనికి ప్రవేశపెట్టు' అని పరిచారికకు అనతిచ్చారు ప్రభువు.

గొప్ప వర్చస్సు, అందాన్ని, హుందాతనాన్ని నింపుకున్న గుండ్రని ముఖం; విశాలమైన ఫాలభాగం; అలౌకిక సౌందర్యాన్ని అన్వేషిస్తూ కలలు కంటున్నట్లుండే కళ్ళు— అపరమయుడుగా కన్పించే సూర్యవర్మ నెమ్మదిగా ప్రవేశించి, వినయంగా వంగి నమస్కరించాడు.

రాణీవారు కూడ ప్రభువు చెంత ఉండడం గమనించి ఆశ్చర్య పడి ఆమెకూ నమస్కరించాడు.

రాణివారి అపూర్వ సౌందర్యాన్ని చూసి తన్మయుడై పోయాడు జాబిలి జ్యోత్స్నలు విరజిమ్మే ఆమె ప్రసన్నమైన దృక్కులకు ఆ కళోపాసకుడు పరవశం చెందాడు. విగతచేతనుడై ఆమె అతిలోక రూప లావణ్యాన్ని పరిశీలిస్తూ ఉండి పోయాడు

వెంటనే సంభాళించుకుని తత్తరపాటుతో రాణీవారికి మరొకసారి వినయాంజలి ఘటించాడు. ఇది గమనించిన రాణి పల్లవాధరంపై హాస్యరేఖ విరిసింది. ప్రభువుల మోములో చిరునవ్వు చెంగలించింది.

'ప్రభువులు దర్శనం ఇప్పించి నన్ను కృతార్థుణ్ణి గావించారు' అన్నాడు వినయం ఉట్టిపడేటట్లు.

శిల్పి వినయ వచనాలకూ ప్రభువులు ముగ్ధులయ్యారు.

'చూడు శిల్పీ! నీవు కళామూర్తివి. అపరమయుడవు. నిన్ను చూడటం మాకు సంతోషం. ఆసనం స్వీకరించు.'

'ధన్యుణ్ణి ప్రభూ!'

'శిల్పీ! నీవు మలచిన శిల్పాన్ని రాణీవారు బాగా మెచ్చుకున్నారు. మాకు కూడ అది బాగా నచ్చింది. దాన్ని మా ప్రసాదంలో అలంకరించాం' అన్నారు రాణీవారి వంక చూసి.

శిల్పి కూడ తన దృష్టిని రాణీవారివైపు మరల్చాడు. ఆ వదన చంద్రం మరొకసారి దరహాస చంద్రికలు ప్రసరింపచేసింది. రాణీవారి ఆదరభావానికి కృతజ్ఞతా సూచకంగా శిల్పి ఒకసారి నతమస్తకుడయ్యాడు. ప్రభువువైపు తిరిగి అల్లే శిరం వంచాడు.

"మేము దేవీ నవరాత్రులు జరపదలచిన సంగతి నీకు తెలిసే ఉంటుంది. దేవీ విగ్రహాన్ని నీచేతనే చేయించాలని మా సంకల్పం."

"చిత్త. ప్రభువువారి ఆదేశం ప్రకారమే నడుచుకుంటాను."

"శిల్పి! నీవు శిల్పకళా సార్వభౌముడవు. అందు చేత ఈ విషయంలో మేము చెప్పగల దేముంటుంది?"

"ప్రభువుల శిల్పకలా విజ్ఞానం సామాన్యమైనదా! ప్రభువులు ఏ విధంగా చేయమంటే అలాగే చేస్తాను. ప్రభువులకు కావలసింది మృత్తికా శిల్పం గదా!"

"అవును. ఉత్సవ పూజకు మృత్తికా శిల్పమే తగినది. నీ కళా

నైపుణి అంతా ప్రదర్శించి అత్యంత మనోహరంగా దేవి విగ్రహం తయారు చేయాలని మా కోరిక."

"చిత్తం"

ప్రభువు సేవకుని పిలిచి "శిల్పికి తగు పారితోషికం ఇచ్చి పంపమని దివాన్జీతో మా మాటగా చెప్పు" అని ఆజ్ఞాపించారు.

శిల్పి ప్రభువుకు, రాణీవారికి వందనంచేసి సెలవు తీసుకున్నాడు.

దివాన్జీ ఉత్సవ సన్నాహాలను పది కళ్ళతో కనిపెట్టి జరిపిస్తున్నారు.

సూర్యవర్మ తన శిల్ప మందిరంలో దేవీ విగ్రహ నిర్మాణంలో నిమగ్నుడయ్యాడు. సంప్రదాయబద్ధంగా దేవీ విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నాడు.

ఆనాడు ప్రభు దర్శన సమయంలో చూచిన రాణి సుభద్రాదేవి వారి అపూర్వ రూపలావణ్యం శిల్పి మనోఫలకం మీద స్థిరరూపం దాల్చింది. రాణీవారు దేవతామూర్తివలె ప్రసరించిన దరహాస రేఖను మరువలేకపోతున్నాడు. ఆమె ముఖ బింబమే అతని కనుదోయిలో ప్రతిబింబిస్తూంది, విగ్రహం చేస్తున్నప్పుడు.

తదేక దీక్షతో విగ్రహం నిర్మిస్తున్నాడు శిల్పి అతనికి తెలియకుండా నే దేవి విగ్రహంలో పూర్తిగా రాణీవారి రూపలావణ్యం ద్యోతకమవుతూంది. ముఖంలో అదే పసన్నత, అదే అతిలోక సౌందర్యం అధరంలో అనే దరహాస రేఖలు వెల్లివిరుస్తున్నాయి. నేత్రాలు తప్ప తక్కిన విగ్రహం అంతా పూర్తిఅయింది రాణి సుభద్రాదేవికీ, ఈ దేవీ విగ్రహానికి వ్యత్యాసంలేదు. అప్రయత్నంగా శిల్పి హస్తాలు విగ్రహాన్ని ఆ విధంగా మలచినాయి.

ఉత్సవాలు ప్రారంభమయ్యే దినం ఉదయమే దేవీ విగ్రహానికి కలువరేకులవంటి నేత్రాలు అమర్చాడు. అవి కూడ రాణీవారి కండ్లను పోలినవే. శిల్పి దేవికి పూజచేసి, మోకరిల్లి కరుణించమని వేడుకున్నాడు.

బహుసుందరంగా అలంకరించిన రథం శిల్పిగృహానికి పంపారు దివాన్జీ. తాను మలచిన అపూర్వ కళాఖండం దేవీ విగ్రహాన్ని తనఇంటి నుండి తరలించలేకపోతున్నాడు సూర్యవర్మ. తన కళా సంపదను, తాను సర్వశక్తులూ ధారపోసి సృష్టించిన మహనీయమూర్తిని పంపడానికి మనసు రావడంలేదు. అతని కన్నులలో నీరునిండింది.

మంత్ర పఠనం జరుగుతూ ఉండగా దేవీ విగ్రహాన్ని తేరుపై చేర్చారు. వాద్యాదులతో, మంత్ర పఠనాలతో, ఆనందోత్సాహాలతో విగ్రహాన్ని ఉత్సవమంటపం వద్దకు చేర్చి పీఠంమీద ప్రతిష్ఠించారు.

వేలాదిగా ఉన్న ప్రజలు చేసే జయ జయ ధ్వానాలు మిన్నుముట్టాయి.

వెంకటాద్రి ప్రభువు స్వయంగా పూజ చేశారు. దేవికి నమస్కరించి, విగ్రహ సౌందర్యాన్ని పరీక్షగా చూశారు. ఆశ్చర్యపోయారు. కన్నులు నులుపుకుని మరొక్కసారి పరిశీలించారు. తమను తానే నమ్మలేకపోయారు. లోకమాత దేవీ విగ్రహంలో రాణీవారి పోలికలు ప్రస్ఫుటిస్తున్నాయి. ముఖ కవళికలు పూర్తిగా రాణీవారివే వింతగా తోచింది.

రాణీవారు కూడ దేవీ దర్శనం చేశారు. వారు సహితం దేవీ విగ్రహాన్ని చూసి చకితులయ్యారు. ఆ మూర్తిలో తమ ఛాయలు చిత్రితం కావడం వారికి ఆశ్చర్యంగా తోచింది.

అర్చకులు, ప్రజలు కూడ విగ్రహాన్ని చూసి ఎంతగానో కొనియాడారు అంత ప్రసన్నంగాను, అంత అందంగాను విగ్రహం ఎప్పుడూ తయారు కాలేదు. సూర్యవర్మ కళా ప్రతిభకు జోహారు లర్పించారు.

శిల్పి ఆ విగ్రహానికి జరిగే పూజారులను చూసి తన్మయుడవుతూ ఉండేవాడు. ఆ విగ్రహంవైపు తృప్తితో చూస్తూ చాలా సేపు గడిపే వాడు. ఊహాపథంలో ఏవో దివ్యలోకాలలో సంచరించే వాడు.

ఉత్సవాలు అఖండ వైభవంతో జరుగుతున్నాయి. ప్రజలు ఆ ఆబాలగోపాలం వచ్చి వేడుకలను కన్నుల పండువుగా తిలకిస్తున్నారు. మంటపం వద్ద జరిగే హరికథలు, పురాణ కాలక్షేపాలు, భజనలు, గానసభలు, నృత్య ప్రదర్శనలు మొదలైనవి అత్యంత రమణీయంగా సాగుతున్నాయి.

ఇవి అన్నీ సక్రమంగా ఉన్నా వెంకటాద్రి ప్రభువుల మనస్సు కలవరపడుతున్నది. కోరి కోరి శిల్పిని పురమాయించినందుకు ఇంతటి అపచారమా అనుకున్నారు. కాని వారు ఎవరితోనూ ఈ ప్రసక్తి తేలేదు. లోలోపలనే తర్జన భర్జనలు చేసుకుంటున్నారు. శిల్పి ఇలా చేయడానికి కారణ మేమా అని పరి పరి విధాల తర్కించుకుంటున్నారు. ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. ప్రభువులు.

ఉత్సవాలు సమాప్తం కాబోతున్న కొద్దీ సూర్యవర్మకు విచారం అధికమతున్నది. దినంలో చాల భాగం దేవీ సమక్షంలోనే గడుపుతున్నాడు ఉత్సవాంతాన అమ్మవారిని బృందావనీ నదిలో వదలివేయడం రత్నాపురవాసుల సంప్రదాయం.

తాను సృష్టించిన ఈ దేవతామూర్తి ఇక కనుపించకుండా బృందావనీ వాహినీ గర్భంలో లీనం కాబోవడం తలచుకున్నప్పుడు సూర్య

వర్మ బాధతో కుమిలిపోయేవాడు. ఆ మూర్తి సృజితమైన క్షణంనుంచి తాను పూర్తిగా మారి పోయాడు. ఆ శిల్పంతో తన కొక దివ్యాను బంధం ఏర్పడింది. ఆ మూర్తి తన ఎదుట లేకుండా మాయమైతే తన జీవితంలో పెద్ద లోటు కలుగుతుంది. తాను ఇంతకుపూర్వం ఎన్నో అద్భుత కళాఖండాలను సృష్టించాడు. కాని ఏదీ తనను ఇంతగా లోబరుచుకోలేదు. మనస్సును చిక్కబట్టుకోవడానికి యత్నిస్తున్నాడు.

భయపడుతున్న దినంరానే వచ్చింది. ప్రజలు తండోపతండాలుగా సమావేశమయ్యారు. అతి కోలాహలంగా ఉంది.

సూర్యవర్మ హృదయం బాధా పరితప్తమవుతున్నది.

వెంకటాద్రి ప్రభువులకు ఒక విధంగా హృదయ భారం తగ్గుతున్నది. దేవతా విగ్రహం వారికి క్రొంత మనఃక్లేశం కలిగించింది.

పెద్ద ఏనుగుమీద అందమైన అంబారీ కట్టారు. అమ్మవారిని శాస్త్రోక్తంగా అందులో కూర్చోపెట్టారు. ప్రభువులు కూడ ఒక చేయి వేశారు. సంప్రదాయానుసారం. ప్రజలు జయధ్వానాలు చేశారు.

పెద్ద ఊరేగింపు బృందావని నదీముఖంగా తరలింది. సూర్యవర్మ నేత్రాలనుంచి కన్నీరు జాలు వారింది.

ఘట్టం చేరగానే ప్రజలు గట్టు వెంబడి బారులు తీరి నిలబడ్డారు. దేవీ విగ్రహాన్ని అతి కోలాహలంగా జలప్రవేశం గావించారు.

ఈ దృశ్యం చూస్తున్న సూర్యవర్మ గుండె చెరువయ్యేటట్లు విలపించాడు లోలోపల అంతా అంధకారంగా తోచింది. మదిలో మాత్రం ఆ రూపం దివ్య జ్యోతిలా భాసిస్తున్నది.

శిల్పి తన ఇల్లు చేరుకున్నాడు విచారంతో.

వెంకటాద్రి ప్రభువుల అధ్వర్యంలో జరిగిన దేవీ నవరాత్రి ఉత్సవాలు మహా వైభవంగా ఉన్నాయని అందరూ పొగిడారు.

ప్రభువు మనస్సు మాత్రం ఇంకా వికలంగానే ఉన్నది. దేవీ విగ్రహంలో రాణీవారి రూపురేఖలు చిత్రించడంలో శిల్పి మనోగతభావమేమిటో వారికి అర్థం కాలేదు. అందుకే వారిని తెలియని బాధ వేన్నాడుతున్నది.

దివాన్జీని పిలిచి తమ శారదా మందిరంలో అలంకరించే నిమిత్తం సూర్యవర్మచేత పాలరాతితో సరస్వతీ విగ్రహం ఒకటి చేయించవలసిందిగా చెప్పారు. ఈ విగ్రహంలో రాణీవారి పోలికలు రాకుండా ఉంటే వారి మనస్సు కొంత కుదుటపడుతుంది.

దివాన్జీ శిల్పికి కబురు పంపి రప్పించి ప్రభువు వారి ఆజ్ఞ తెలియచేశాడు.

కార్యోన్ముఖుడుగా లేకపోయినా సూర్యవర్మ ఈ పనికి పూనుకోక తప్పింది కాదు. ఆ దేవీ విగ్రహ రూపురేఖలే, రాణీవారి ప్రసన్న వదనంలోని దివ్య లావణ్యమే తనకు గుర్తుకొస్తున్నాయి. ఏ అందచందాలను, ఏ రూపరేఖా వైలక్షణ్యాలను దేవీ విగ్రహంలో ప్రతిఫలింపచేశాడో సరిగా వాటినే ఈ చదువుల తల్లిలో కూడా ప్రదర్శించాడు. విగ్రహం భువనమోహనంగా తయారయింది.

స్వయంగా విగ్రహం తీసుకువెళ్ళాడు. ప్రభువువద్దకు నమస్కరించి విగ్రహం ఒక పీఠంమీద ఉంచాడు.

ప్రభువులు విగ్రహం చూశారు చూసీ చూడటంతోనే వారి ముఖం వివర్ణమైపోయింది. నేత్రాలు ఎరుపెక్కాయి. పెదవులు కంపించాయి. హృదయం కోపోద్దీపితమయింది.

"శిల్పీ! చాలా అపచారం చేస్తున్నావు మాకు ఈ విగ్రహంమాకు పనికిరాదు, తీసుకువెళ్లు అంతేకాదు. ఇక నీవు శిల్పకళ విడనాడాలి. అంతే ఇది మా ఆజ్ఞ. నీవు వెళ్ళవచ్చు" ప్రభువులు గర్జించారు.

శిల్పి చకితుడయ్యాడు. "నిర్దోషిని ప్రభూ! క్షమార్హుడను. తెలిసి ఏ దోషమూ చేయలేదు" అన్నాడు ప్రార్థనాపూర్వకంగా.

"మా కవన్నీ చెప్పుకో నవసరంలేదు" అన్నారు ప్రభువులు తీవ్రంగా.

శిల్పి ఖిన్నుడై తన విగ్రహాన్ని తీసుకుని మందిరం దాటి వచ్చేశాడు.

ఇల్లు చేరుకున్న శిల్పి తన శిల్ప మందిరంలో ఉన్న. వివిధ శిల్పాలను ఒకసారి తేరిపార చూశాడు. ప్రభువు వారి ఆజ్ఞ గుర్తుకురాగా భోరున విలపించాడు, ఆ శిల్పాల హృదయాలు ద్రవించేటట్లు.

శిల్ప సృష్టి జరగనిదే తన జీవితమే లేదు. అకారణంగా ప్రభువులు తనపై ఇట్టి కఠోర ఆజ్ఞ విధించడం ఎందుకో శిల్పికి తెలియలేదు.

లోకమంతా చీకటి తెరలు ఆవరించాయి. అనుమానపు ఛాయలు వివేచనను కప్పినట్లు,

శిల్పి తాను కడసారిగా చెక్కిన శారదా విగ్రహాన్ని వెంట తీసుకుని బయలుదేరాడు. అతని పాదాలు బృందావనీ నదివైపు ఉరకలు తీస్తున్నాయి. అతని మనస్సు దేవి పాదాలపై లగ్నమై ఉంది. తాను నిర్దోషినని ఆ దేవితో మొరపెట్టుకొని, తన నిర్దోషిత్వాన్ని ఆ తల్లిచేత రుజువు చేయించాలనుకున్నాడు.

ఘట్టం చేరుకున్నాడు. దేవిని స్తుతించి నమస్కరించాడు. తాను సృష్టించిన ఆ దేవతామూర్తి జలప్రవేశం చేసిన చోటనే మహా శిల్పి సూర్యవర్మ నీటిలో దిగాడు దేవీ సాన్నిధ్యం చేరుకోవడానికి.

పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తున్న బృందావనీ నదీమతల్లి అమర శిల్పి సూర్యవర్మకు తన ఒడిలో శాశ్వత స్థానం ఇచ్చి ఆదరించింది.